
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
శుక్రవారం 28 మార్చి 2025





జోగిపేట పట్టణంలోని గాని వద్ద ప్రజల సందర్శనార్థం ఉంచిన జోగినాథుడి రథం

జోడు లింగాల జాతర

- ఏప్రిల్ 2 నుంచి జోగినాథుడి ఉత్సవాలు
- సిద్ధమైన మహా రథం
- జోగిపేటకు ఉత్సవ శోభ
- ముమ్మరంగా ఏర్పాట్లు

7

'కాంతార్' కనికట్టు

కౌడిపల్లిని కుదిపేసిన బోగస్ సంస్థ



కౌడిపల్లికి చెందిన డబ్బి లింగమ్మ అనే పేద మహిళ వద్ద ఓ వ్యాపారం నిర్వహించే వ్యక్తి రూ.6వేలు తీసుకున్నాడు. ప్రతీరోజు రూ.200 చొప్పున ఏడాది పాటు డబ్బులు వస్తాయని నమ్మబలికాడు. దీంతో లింగమ్మతోపాటు వారి బంధువులు మరో ఐదుగురు మహిళలు తమ కాలి పట్టీలను విక్రయించి రూ.6వేల చొప్పున చెల్లించారు. కానీ ఒక్క రూపాయి కూడా వీరికి తిరిగిరాలేదు. తీసుకున్నవారిని ప్రశ్నించగా తమను అడిగితే ఉల్టా పోలీసులకు చెబుతామని బెదిరిస్తున్నారని లింగమ్మ వాపోయింది'. లింగమ్మ మాదిరిగానే మరికొంతమందిని సదరు వ్యాపారులు బోల్తాకొట్టించారు. ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని బాధితులు 'ఆంధ్రజ్యోతి'కి మొరపెట్టుకున్నారు.

ఒక్కసారి డిపాజిట్ చేస్తే ప్రతీరోజు రిటర్న్స్ ఇస్తామని మాయమాటలు

2వేల మంది వద్ద రూ.5కోట్ల వరకు వసూలు!

ఇద్దరు వ్యక్తుల పాత్రపై సందేహాలు

ఫిర్యాదు చేశామంటున్న బాధితులు.. లేదంటున్న పోలీసులు

ఉమ్మడి మెదక్ జిల్లాలో విస్తరిస్తున్న ఈజీమనీ సంస్కృతి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 27: మెదక్ జిల్లా కౌడిపల్లి మండలాన్ని 'కాంతార్' అనే బోగస్ సంస్థ కుదిపేసింది. రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేద కుటుంబాలను నట్టేట ముంచింది. ఒక్కసారి సొమ్ము డిపాజిట్ చేస్తే ఏడాదిపాటు రోజువారీగా డబ్బులు చెల్లిస్తామని ఆశ చూపించి బురిడీ కొట్టించింది. ఇందుకు స్థానికంగా ఒకరిద్దరిని పాత్రధారులుగా చేయడంతో మండలంలోని పలు గ్రామాల ప్రజలు విశ్వసించారు. అప్పులు చేసి, ఆభరణాలు తాకట్టుపెట్టి డబ్బులు చెల్లించి దారుణంగా మోసపోయారు.



'కాంతార్' సంస్థ పేరిట వాట్సాప్ గ్రూపులు

రూ. లక్ష కడితే రోజుకు రూ. 5వేలు!

'కాంతార్-వర్క్‌ఫ్రమ్ హోమ్-వర్క్ ఫ్రమ్ మొబైల్' పేరిట కౌడిపల్లి మండలంలోని అమాయక ప్రజలతో 5 వాట్సాప్ గ్రూపులు క్రియేట్ చేశారు. ఒక్కో గ్రూపులో 500 పైగానే సభ్యులున్నారు. ఈ లెక్కన వీరంతా కూడా డబ్బులు చెల్లించినవారే కావడం గమనార్హం. ముందుగా రూ.6వేలు చెల్లిస్తే రోజుకు రూ.200 చొప్పున ఏడాది పాటు చెల్లిస్తామని ఒప్పందం చేసుకుంటారు. రూ.6వేలకు ఏడాదిలో 200 చొప్పున అంటే రూ.73వేల దాకా వస్తాయని ఆశ చూపించారు. అలాగే రూ.20వేలు చెల్లిస్తే రోజుకు రూ.700, రూ.50వేలు చెల్లించినవారికి ప్రతీరోజు రూ.2వేలు, ఇక రూ.లక్ష కట్టినవారికి నిత్యం రూ.5వేల చొప్పున తిరిగి ఇస్తామనడంతో చాలామంది ముందుకొచ్చారు. దీనికితోడు వాట్సాప్ గ్రూపుల్లో కొందరికి డబ్బులు రోజువారీ తిరిగి పంపించే స్క్రీన్‌షాట్స్‌ను పెట్టడంతో మిగితవారు కూడా నమ్మారు.

ఐదు గ్రూపులు.. వేల మంది బాధితులు

కౌడిపల్లి మండలంలో జీ1, జీ2, జీ3, జీ4, జీ5 పేరిట ఐదు వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేశారు. అన్ని గ్రూపుల్లో కలిసి దాదాపు 2వేల మంది వరకు సభ్యులున్నట్లు తెలుస్తోంది. వీరందరి నుంచి రూ. 5కోట్ల వరకు వసూలు చేసినట్లు చర్చించుకుంటున్నారు. బాధిత్లో కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంకొంతమంది మోసపోయినట్లుగా గ్రహించినా బయటపడటం లేదు. మరికొందరేమో తమ

మిగతా 7వ పేజీలో

'ఉపాధి' కూలీలకు ఉపశమనం

'ఆంధ్రజ్యోతి' కథనంపై కలెక్టర్ ఆరా ● పలుచోట్ల నీడ, నీటి వసతి ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 27: ఉపాధి హామీ పనులు జరుగుతున్న చోట 'నీడ లేదు.. నీళ్ల కరువు' అనే శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి స్పందించారు. ఉపాధిహామీ పనులు కొనసాగుతున్న తీరుపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కూలీలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాగునీరు, నీడ ఏర్పాటు చేయాలని సూచించారు. వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో స్థానికంగా అధికారుల్లో చలనం వచ్చింది. పలు గ్రామాల్లో గురువారం ఉపాధిహామీ పనులు జరుగుతున్న చోట నీడ, తాగునీటి వసతి కల్పించారు. అనేకచోట్ల ఇంకా ఎండలోనే పనులు చేయించారు.



కోహీర్ మండలం కవెల్లిలో ఉపాధి హామీ కూలీలకు నీడ కల్పించి ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేసిన అధికారులు



'ఖేడ్' ఆస్పత్రిలో కాయకల్ప బృందం తనిఖీలు

నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రిని గురువారం 'కాయకల్ప' బృందం తనిఖీ చేసింది. సీఏఎస్ డాక్టర్ పి.శ్రీకాంత్, నర్సింగ్ అధికారులు శిరీష, జెస్సీ ఫ్లోరెన్స్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆరోగ్య మిత్ర డీఈవో శ్రీహరి ఆస్పత్రిని సందర్శించారు. వార్డులు, మందుల నిల్వ గది, ఆపరేషన్ థియేటర్‌లను పరిశీలించి.. పరిశుభ్రత, రికార్డుల నిర్వాహణ, సుఖ ప్రసవాలు, ఇన్‌పేషెంట్, ఓపీ సేవలు తదితర విషయాలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

-నారాయణఖేడ్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి)

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పక్కాగా అమలు : మెదక్ కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్, ఎస్పీ

మెదక్ అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలన్ని పక్కాగా అమలు చేస్తున్నామని, బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు చర్యలు చేపడుతున్నామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ నగేష్, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి శశికళ, గిరిజన సమక్షేమాధికారి నీలిమ, ఆర్డీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్.. స్పందన లెస్

వేధిస్తున్న సర్వర్ సమస్య

అర్జీదారులకు తప్పని నిరీక్షణ

సంగారెడ్డి టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేఅవుట్ రెగ్యులరైజేషన్ (ఎల్ఆర్ఎస్) స్కీంకు అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఆశించిన స్థాయిలో స్పందన రావడం లేదంటూ అధికార యంత్రాంగం ఓవైపు తలలు పట్టుకుంటుంటే... మరోవైపు సర్వస్ సమస్య, ఎల్1 పెండింగ్ సమస్యలు వెంటాడుతున్నాయి. వంద శాతం ఎల్ఆర్ఎస్ లక్ష్యాన్ని సాధించాలన్న లక్ష్యంతో నెల రోజులుగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.ఈ నెలాఖరులోగా ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించినవారికి 25 శాతం రాయితీ ఇస్తామంటూ ప్రకటించింది. దీనిపై ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. కాలనీల్లో ప్రచారం చేయడంతో పాటు ప్రధాన కూడళ్ల వద్ద ఫ్లెక్సీలను సైతం ఏర్పాటు చేశారు. అయినప్పటికీ, తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవడానికి ఆసక్తి కనబర్చడం లేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మూడు రోజులుగా సర్వర్ డౌన్

ఈ నెల 31వ తేదీలోగా ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లిస్తే 25 శాతం రాయితీ ఇస్తామని సర్కార్ ప్రకటించడంతో రెండుమూడు రోజులుగా ప్రజల నుంచి స్పందన వస్తున్నది. తమ ప్లాట్లు, లేఅవుట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. కానీ, ఆఫీసులకు అర్జీదారులు క్యూ కడుతున్న సమయంలో మూడు రోజులుగా సర్వస్ సమస్య ఎదురవుతున్నది. రాయితీ గడువు మూడు రోజుల్లో ముగుస్తున్న నేపథ్యంలో సర్వస్ సమస్య అధికారులకు తలనొప్పిగా మారింది. మున్సిపాలిటీలు, నీటి పారుదల శాఖ, గ్రామ పంచాయతీ, రెవెన్యూశాఖ కార్యాలయాల్లో ఇందుకోసం కౌంటర్లను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ సర్వర్ సమస్య వెంటాడుతుండటంతో అర్జీదారులు గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. ఒకొక్కరికి రెగ్యులరైజేషన్ ప్రక్రియను పూర్తిచేయాలంటే గంటకు పైగా సమయం పడుతున్నది. దీంతో, అర్జీదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయ సిబ్బందితో వాగ్వివాదానికి దిగుతున్నారు. డబ్బులు చెల్లించిన అరగంట లోపే ప్రొసిడింగ్స్ ఇస్తామని ప్రకటించినప్పటికీ వారం రోజులవుతున్నా ప్రొసిడింగ్ రావడం లేదని అర్జీదారులు వాపోతున్నారు. లక్షలాది రూపాయలు చెల్లించినా తీవ్ర జాప్యం జరుగుతుండటంతో అయోమయానికి గురవుతున్నారు.



సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో సర్వర్ సమస్యతో నిరీక్షిస్తున్న ఎల్ఆర్ఎస్ అర్జీదారులు

ఎల్1 పెండింగ్ అడ్డంకి

రాయితీ గడువు దగ్గరపడుతున్నవేళ ఎల్ఆర్ఎస్ అర్జీదారులకు అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఓవైపు సర్వర్ సమస్య వేధిస్తుంటే. మరోవైపు ఎల్1 పెండింగ్ రూపంలో అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఎల్1 పెండింగ్ వల్ల రెగ్యులరైజేషన్ ఫీజు చెల్లించకుండా అర్జీదారులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఎల్1 పెండింగ్ ఇరిగేషన్, మునిసిపల్, రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖల్లో ఏదో ఒకచోట వెరిఫికేషన్ చేయకపోవడంతో ఆన్‌లైన్‌లో పెండింగ్ చూపుతున్నది. ఎల్1 పెండింగ్‌లో ఉన్నవారు సబ్ రిజిస్ట్రార్ నుంచిఎన్‌వోసీ కావాలంటూ మెలిక పెట్టడంతో అర్జీదారులు నిరుత్సహానికి గురవుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ చొరవ తీసుకుని ఎల్1 సమస్యను పరిష్కరించాలని అర్జీదారులు కోరుతున్నారు.



మెదక్ మున్సిపల్ కార్యాలయం వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తున్న కమిషనర్, సిబ్బంది

పన్ను బకాయిలపై 90 శాతం రాయితీ..

అవగాహన కల్పించేందుకు ఫ్లెక్సీలు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో పేరుకుపోయిన పన్నులపై వడ్డీలో 90 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో మెదక్ మున్సిపాలిటీ పరిధిలో 1333 నివాసాలపై ఉన్న బకాయిలకు రూ. 25 లక్షల మేర వడ్డీ మాఫీ అవుతుందని కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు రూ. 11.53 కోట్ల మేర పన్నులు చెల్లించాల్సి ఉండగా.. రాయితీని సద్వినియోగం చేసుకుంటే రూ. కోట్లలో ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. వడ్డీ మాఫీపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మున్సిపల్ కార్యాలయంతో పాటు పట్టణంలో పలుచోట్ల ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారు.

నిమ్జ్ పనులు వేగవంతం చేయండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే మాణిక్‌రావు



జహీరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న నిమ్జ్ (నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మాన్యూఫ్యాక్చరింగ్ జోన్) పనులను వేగవంతం చేయాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అసెంబ్లీ సమావేశాల్లో కోరారు. అసెంబ్లీలో గురువారం ఆయన మాట్లాడుతూ నిమ్జ్ పనులు పూర్తయి పరిశ్రమలు తరలివస్తే జహీరాబాద్ డివిజన్‌లో వేలాదిమంది యువతకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. సంగమేశ్వర ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తిచేసి సాగునీ రందించాలని పేర్కొన్నారు. పట్టణంలోని ఉర్దూ మీడియం జూనియర్ కళాశాలలో అధ్యాపకుల కొరత తీర్చాలని కోరారు.

అపార్.. విద్యార్థులు బేజార్

- ఆధార్ కార్డు, యూడైస్ వివరాలకు కుదరని పొంతన
- 'అపార్' నమోదులో ఇక్కట్లు
- 'మీసేవ'ల చుట్టూ తల్లిదండ్రుల చక్కర్లు

జోగిపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అపార్ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కోసం అవస్థలు తప్పడం లేదు. అపార్ నమోదు ప్రక్రియ అటు విద్యార్థులను, ఇటు వారి తల్లిదండ్రులను ఇక్కట్లకు గురిచేస్తోంది.

గతంలో యూడైస్..

దేశంలో నర్సరీ నుంచి 12వ తరగతి (ఇంటర్మీడియేట్) చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేకమైన శాశ్వత నంబరును కేటాయిస్తూ ప్రభుత్వం ప్రతీ పాఠశాలలోనూ యూడైస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్) తప్పనిసరి చేసింది. దేశం మొత్తం మీద ప్రతీ పాఠశాలకు 11 అంకెలతో కూడిన ఒక యూనిక్ ఐడీని కేటాయించారు. యూడైస్‌లో ప్రతీ విద్యార్థి వివరాలన్నీ తప్పనిసరిగా పొందురచాలి. రాష్ట్రంలో చాలామట్టుకు ప్రభుత్వ పాఠశాలలే ఉన్నాయి. వారిలో చేరిన విద్యార్థులందరూ గ్రామీణ ప్రాంతాల వారే కావడంతో నర్సరీలో తమ పిల్లల్ని చేర్చే సమయంలో తల్లిదండ్రులు గుర్తున్న జన్మదినం నమోదు చేశారు. ఆధార్ నమోదు సమయంలో జనన ధ్రువీకరణ పత్రం ఆధారంగా పుట్టిన తేదీని నమోదు చేయించారు. విద్యార్థి పేరు, ఇంటిపేరు, ఇంటి పేరులో సైతం పాఠశాల రికార్డుల్లో తేడాలున్నాయి. దీంతో, యూడైస్‌కు, ఆధార్ రికార్డులకు పొంతన లేకుండా పోయింది. ఇదే విద్యార్థుల పాలిట శాపంగా మారింది.



మీసేవ సెంటర్లో అపార్ దరఖాస్తు కోసం వేచిచూస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

అపార్ నమోదులో ఇబ్బందులు

యూడైస్‌తోపాటు, ప్రభుత్వం గత డిసెంబరు చివరి వారం నుంచీ అపార్ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)ను ప్రవేశపెట్టింది. యూడైస్‌లో రాష్ట్ర, జిల్లా, బ్లాక్, పాఠశాల కోడ్‌లు ఉండగా, అపార్‌లో విద్యార్థి వివరాలు ఉంటాయి. అయితే, అపార్ వ్యవస్థ బాగానే ఉన్నా దీని నమోదు చేసే విద్యార్థి పేరు, ఇంటిపేరు, పుట్టిన తేదీ తదితర వివరాలన్నీ అయితే యూ డైస్ ప్రకారమైనా ఉండాలి. లేదా ఆధార్ ప్రకారమైనా ఉండాలనేది అపార్ నిబంధన. ఇదే విద్యార్థులకు ఇబ్బందులు కలుగజేస్తోంది. ఆధార్ కార్డు ఆధారంగానే విద్యార్థి వివరాలను నేరుగా అపార్‌లో నమోదు చేస్తే ఏ ఇబ్బందీ ఉండడం లేదు. యూడైస్‌లో సదరు మార్పులను పాఠశాలలోనే చేసుకుని, నేరుగా అపార్‌లో పొందుపరచవచ్చు. కానీ కొందరు తల్లిదండ్రులు ఆధార్ కార్డు ప్రకారం కాకుండా ఇతర వివరాలను నమోదు చేయమంటున్నారు. దీంతో యూడైస్ వివరాలకు, ఆధార్ వివరాలకు పొంతన కుదరడం లేదు. దీంతో తప్పనిసరై విద్యార్థుల తల్లిదండ్రులు యూడైస్ ప్రకారం ఉన్న వివరాలతోనే ఆధార్‌లో మార్పులు చేసుకోవాల్సిన అగత్యం ఏర్పడుతోంది. ఇందుకోసం మీసేవలకు వెళ్తే అక్కడ పుట్టిన తేదీ కోసం తప్పనిసరిగా జనన ధ్రువీకరణ పత్రం అవసరమౌతోంది. చాలా మందికి బర్త్ సర్టిఫికెట్ లేకపోవడం, దానిని పొందడానికి చాలా సమయం అవసరపడడంతో ఎలా అపార్ నమోదు చేయాలో అర్థం కావడం లేదు.

అంతా సర్దుకుంటుంది



ఈ జనవరి మొదటి వారం నుంచే అపార్ నమోదు ప్రారంభం కావడంతో అందరికీ ఈ పద్ధతి కొత్తగా ఉంది. వచ్చే సంవత్సరానికి అంతా సర్దుకుంటుంది. ఆధార్ వివరాల ఆధారంగా నమోదు చేసుకునే విద్యార్థికి ఎస్‌వో-3 ఫారం ఆధారంగా అపార్ ఎంట్రీ చేయవచ్చు. ఒక వేళ ఆధార్‌లో తప్పుంటే తాము ఇచ్చే బొనాఫైడ్ సర్టిఫికెట్ ఆధారంగా మీసేవలో బర్త్ సర్టిఫికెట్ తీసుకుని, అపార్‌లో నమోదు చేసుకోవాలి.

- బండి కృష్ణ, ఎంఈవో

పాడుబడిన బావిలో పడి ఇద్దరి మృతి

● మృతులు ఒడిశా రాష్ట్రానికి చెందిన వారు


వైద్యనాథ్(ఫైల్)

కోహీర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పాడుబడిన బావిలో పడి ఒడిశా రాష్ట్రానికి ఇద్దరు యువకులు మృతిచెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని పైడిగుమ్మల్ గ్రామంలో చోటుచేసుకున్నది. కోహీర్ ఎస్‌ఐ కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన వైద్యనాథ్(25) హరసింగ్(30) కొన్ని రోజుల క్రితం కోహీర్ మండలం పైడిగుమ్మల్ గ్రామంలోని ఓ వెంచర్‌లో పనిచేసేందుకు వచ్చారు. 10 రోజుల క్రితం అక్కడ పనిచేస్తూ సాయంత్రం వేళ నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు పైడిగుమ్మల్ గ్రామానికి వెళ్లారు. తదనంతరం వారు పనిచేసే ప్రాంతానికి ఎంతకు తిరిగి రాకపోవడంతో అక్కడ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న పంకజ్ తివారి మరసటి రోజు కోహీర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. గురువారం సాయంత్రం వారి ఇద్దరు మృతదేహాలను స్థానికులు గ్రామ శివారులోని కట్ట మైసమ్మ సమీపంలో గల ఓపాడుబడిన బావిలో గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకి చేరుకుని మృతదేహాలను వెలికి తీశారు. సూపర్‌వైజర్ పంకజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సతీష్ వివరించారు.


హరసింగ్(ఫైల్)

వేర్వేరు చోట్ల నలుగురి ఆత్మహత్య

● పెద్దమాసాన్‌పల్లిలో పురుగుల మందు తాగిన రైతు.. చికిత్స పొందుతూ మృతి
● మనోహరాబాద్‌లో మద్యానికి బానిసై యువకుడు
● కిస్తీలు కట్టలేక రాయపోల్‌లో మరో యువకుడు..
● గొల్లపల్లిలో ఉరేసుకున్న వ్యక్తి

తొగుట, మార్చి 27 : సిద్దిపేట జిల్లా తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లి గ్రామానికి చెందిన రైతు గుమ్మడిదల వెంకటయ్య(48) ఈ నెల 23న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా కుటుంబీకులు సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం మృతిచెందాడు. వెంకటయ్యకు భార్య లత, ఇద్దరు కూతుళ్లు నాగలక్ష్మి, అశ్విత ఉన్నారు. ఏడాది క్రితం అప్పు చేసి పెద్ద కూతురు నాగలక్ష్మి వివాహం చేశారు. బోరు బావి అడుగంటిపోవడంతో సాగు చేసిన వరి పంట కళ్ల ముందే ఎండిపోగా, అప్పులు ఎలా చెల్లించాలో దిగులు చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు.


వెంకటయ్య(ఫైల్)

మనోహరాబాద్‌లో..

మనోహరాబాద్ మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మనోహరాబాద్‌లో చోటు చేసుకున్నది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రంలోని బాక్సర్ జిల్లా సిమారి గ్రామానికి చెందిన కమలేష్ యాదవ్(25) కాళ్లకల్‌కు ఐదేళ్ల క్రితం వచ్చాడు. వెల్డింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కమలేష్‌యాదవ్‌కు, భార్య మమతయాదవ్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కమలేష్ మద్యానికి బానిసై రోజు తాగి వచ్చేవారు. బుధవారం రోజున రాత్రి మద్యం త్రాగి వచ్చి అన్నం తిని బయటకు వెళ్తున్న అని చెప్పి తిరిగి ఇంటికి రాకా పోవడంతో ఉదయం చుట్టు పక్కల వారి సమాచారం మేరకు కాళ్లకల్ గ్రామా శివరులోని చెటుకు ఉరి వేసుకోని చనిపోయి ఉన్నారు.. పోలీసులు ఘటన స్థలం చెరుకోని మృతుడుని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది. భార్య మమత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.


కమలేష్ యాదవ్ మృతదేహం

రాయపోల్‌లో..

రాయపోల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కిస్తీలు కట్టలేక ఓ యువకుడు పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన రాయపోల్‌లో చోటచేసుకున్నది. స్‌ఐ రఘుపతి కథనం ప్రకారం.. రాయపోల్ గ్రామానికి చెందిన షాదుల్లా(33) ఇంటి నిర్మాణం కోసం రూ.7 లక్షలు రుణం తీసుకున్నాడు. నెలకు రూ.18 వేలు చెల్లించాల్సి ఉంది. కిస్తీలు చెల్లించడం ఇబ్బందిగా మారిందని భార్యతో చెప్పి బాధ పడుతుండేవాడు. ఈనెల 25న ఇంటి నుంచి వెళ్లిన షాదుల్లా మంతూరు గ్రామ సమీపంలో పురుగుల మందు తాగాడు. గమనించిన గ్రామస్థులు షాదుల్లా కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. అలాగే అంబులెన్స్‌కు ఫోన్ చేసి గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స చేసి డిశ్చార్జ్ చేశారు. గురువారం ఉదయం షాదుల్లా అస్వస్థత చెందడంతో మళ్లీ గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ చనిపోయాడు. షాదుల్లా భార్య సల్మాబేగం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


షాదుల్లా(ఫైల్)

గొల్లపల్లిలో..

రాయపోల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండలం గొల్లపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. ఎస్‌ఐ రఘుపతి కథనం ప్రకారం.. గొల్లపల్లి గ్రామానికి చెందిన ఎంకొళ్ల కుమార్(40) మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 26న మద్యం తాగొద్దని కుమార్ భార్య మహంకాళి గొడవ పెట్టుకుని అమ్మగారింటికి వెళ్లింది. మనస్తాపానికి గురైన కుమార్ అదే రోజు సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు గురువారం మృతుని భార్య మహంకాళి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


కుమార్(ఫైల్)

భార్య మృతి కేసులో భర్తకు ఐదేళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : భార్య మృతి కేసులో భర్తకు ఐదు సంవత్సరాల పాటు జైలు శిక్ష విధిస్తూ సంగారెడ్డిలోని ప్రిన్సిపల్ సెషన్స్ సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఎం.రాధాకృష్ణ చౌహాన్ గురువారం తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపిన వివరాల ప్రకారం.. కంది మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేటకు చెందిన పల్లవు లక్ష్మయ్యకు హత్నూర మండలం గోవిందరాజ్‌పల్లికి చెందిన యాదమ్మతో 20 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. లక్ష్మయ్య మద్యానికి బానిసై భార్య యాదమ్మను వేదింపులకు గురిచేసేవాడు. దీంతో 2019 డిసెంబరు 6వ తేదీన యాదమ్మ ఇస్మాయిల్‌ఖాన్‌పేటలోని ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి సోదరుడు పోచయ్య సంగారెడ్డి రూరలల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లక్ష్మయ్య వేధింపుల కారణంగా తన చెల్లెలు యాదమ్మ ఆత్మహత్య చేసుకుందని పేర్కొన్నాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. పూర్తి ఆధారాలను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో నిందితుడు లక్ష్మయ్య(45)కు ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు వేయి రూపాయల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి

● తొగుట మండలం ఎల్లారెడ్డిపేటలో ఘటన


లోకేందర్(ఫైల్)

తొగుట, మార్చి 27: విద్యుదాఘాతానికి గురై రైతు మృతిచెందిన సంఘటన తొగుట మండలం ఎల్లారెడ్డిపేట గ్రామంలో గురువారం ఉదయం చోటుచేసుకున్నది. గ్రామస్థుల కథనం ప్రకారం. గ్రామానికి చెందిన రైతు మన్నె లోకేందర్(35)కు భార్య శైలజ, ఇద్దరు కొడుకులు ఆద్విక్రైలాష్, వాసుదేవా, తల్లి మల్లవ్వ ఉన్నారు. అతడు వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించు కుంటున్నాడు. లోకేందర్ తన వ్యవసాయ భూమిలో వరి పంట సాగు చేశాడు. రోజు మాదిరిగానే లోకేందర్ గురువారం ఉదయం తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. పశువులకు మేత వేయడానికి పొలం ఒడ్డున పెరిగిన గడ్డిని కోయడానికి ఉపక్రమించాడు. ఈ క్రమంలో పొలం ఒడ్డున కడీలకు అమర్చిన విద్యుత్ వైరుకు తగిలి షాక్ గురై పడిపోయాడు. లోకేందర్‌ను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు ధ్రువీకరించారు. భార్య శైలజ ఫిర్యాదు మేరకు తొగుట ఎస్‌ఐ రవికాంత్‌రావు కేసు నమోద్ చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబానికి సుమారు రూ.6 లక్షల వరకు అప్పులు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. బాధిత రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ మాజీ ఎంపీటీసీ వేల్పుల స్వామి ముదిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దేవునూరి పోచయ్య కోరారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


చింత పోచమ్మ (ఫైల్)

టేక్మాల్, మార్చి27 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన టేక్మాల్‌లో బుధవారం రాత్రి చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చింత పోచమ్మ(40) కూలి పని చేసుకుంటు జీవనం కొనసాగిస్తుంది. ఆమె ఒక కూతురు ఉంది. రోజూ లాగానే ఇంటి వద్ద ఉన్న కూతురుకు కల్లు తాగి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. రాత్రి అయిన రాకపోవడంతో బంధువులతో చుట్టుపక్కల ప్రాంతంలో వెతుకుతుండగా గ్రామానికి చెందిన తిమ్మిగీరా మధుసూదన్ కలిసి దన్నరం రోడ్డు వైపు వెళ్లిందని తెలపారు. అటు వైపు వెళ్లి వెతుకగా పొలంలో చనిపోయి కనిపించింది. తన తల్లి మరణం పట్ల అనుమానం ఉందని మృతురాలి కూతరు జ్యోతిక ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

మహిళ హత్య కేసులో నిందితుడికి రిమాండ్


నిందితుడిని చూపుతున్న సీఐ

జోగిపేట రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తనను అకారణంగా దూషించిందన్న కోపంతో ఒంటరిగా ఉన్న ఓ మహిళపై లైంగిక దాడికి పాల్పడి, ఆపై హత్య చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జోగిపేట సీఐ అనిల్ కుమార్ పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం తన కార్యాలయంలో సీఐ వెల్లడించారు. ఈ నెల 12న వట్‌పల్లి మండలం సాయిపేట గ్రామంలో ఒంటరిగా ఉన్న కొట్టె గౌరమ్మ తన ఇంట్లో హత్యకు గురైంది. హత్య జరిగిన నాటి నుంచి, పొరుగింట్లో ఉండే బస్వారెడ్డిపల్లి కిషన్ కనిపించకుండా పోయిన నేపథ్యంలో పోలీసులు, సదరు కిషన్ కోసం గాలింపు చేపట్టారు. గురువారం అదుపులోకి తీసుకుని విచారించారు. కాగా, ఈనెల 12న రాత్రి కొట్టె గౌరమ్మ(హతురాలు) మరో మహిళతో తన గురించి, తన కుటుంబం గురించి పరుశంగా మాట్లాడడాన్ని కిషన్ విన్నాడు. అది భరించలేక అదే రాత్రి, కొట్టె గౌరమ్మ ఇంట్లోకి వెళ్లిన కిషన్ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని పంచాయతీలో తెలుస్తానని గౌరమ్మ కిషన్‌ను బెదిరించింది. దీంతో గౌరమ్మ కళ్లల్లో కారం చల్లి, గొంతు పిసికి హత్య చేసాడు. ఆపై మృతురాలి ఒంటిపైనున్న కమ్మలు, బంగారు గుండ్ల నెక్లెను, సెల్‌ఫోన్‌ను దొంగిలించి, అక్కడ ఉన్న నవారు మంచాన్ని తగులబెట్టి పారిపోయాడు. కిషన్ నేరాన్ని అంగీకరించాడని సీఐ అనిల్ వివరించారు. ఈమేరకు కిషన్‌ను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇంటికి నీళ్లు పడుతుండగా 11కేవీ వైర్ తగిలి ఒకరి మృతి


సుధాకర్‌రెడ్డి(ఫైల్)

శివ్వంపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నిర్మాణంలో ఉన్న ఇంటికి అతి దగ్గర విద్యుత్ స్తంభం ఉండటంతో ప్రమాదవశాత్తు చేయికి 11 కేవీ వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురై ఒకరు మృతిచెందగా గ్రామస్థులు రోడ్డుపై ధర్నా నిర్వహించిన ఘటన చెన్నాపూర్‌లో గురువారం చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చెన్నాపూర్ గ్రామంలో సింగిరెడ్డి సుధాకర్ రెడ్డి (43) ఇల్లు నిర్మాణం చేపట్టాడు. నిర్మాణం పూర్తి కావస్తుండగా శనివారం ఇంటికి నీళ్లు పడుతున్నాడు. ఈ క్రమంలో ఇంటికి అతి సమీపంలో ఉన్న 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు వేసిన పైపు కాలిపోయి ఉండగా, దానికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. కాగా, విద్యుత్ అధికారుల తీరుకు నిరసనగా గ్రామస్థులు గోమారం చిన్నగొట్టిముక్ల ప్రధాన రహదారి చెన్నాపూర్‌లో ఆందోళన నిర్వహించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి విద్యుత్ అధికారులతో మాట్లాడి విద్యుత్ లైన్ సమస్య పరిష్కరిస్తారని గ్రామస్థులకు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. పోస్టుమార్టం నిమిత్తం సుధాకర్‌రెడ్డి మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు. మరికొద్ది రోజుల్లో ఇల్లు పని పూర్తి అయి గృహప్రవేశం చేద్దామనుకున్న తరుణంలో సుధాకర్‌రెడ్డి మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీరని బాధ మిగిల్చింది.


రోడ్డుపై ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

చిన్న వయస్సులోనే
స్వయం సమృద్ధి సాధించేలా చేయాలి

- కేంద్ర మానవ వనరుల అభివృద్ధి, రక్షణ శాఖ మాజీ మంత్రి ఎంఎం పల్లం రాజు
- గీతంలో విజయవంతంగా ముగిసిన టెడ్‌ఎక్స్



గీతం విద్యార్థులతో కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు

పటాన్‌చెరు రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : చిన్న వయస్సులోనే పిల్లలను స్వయం సమృద్ధి సాధించేలా చేయాలని, పాఠశాల విద్య నాణ్యతను పెంచాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి, రక్షణ శాఖ మాజీ మంత్రి ఎంఎం పల్లం రాజు తెలిపారు. హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ ఆధ్వర్యంలో 'టెడ్‌ఎక్స్ గీతం హైదరాబాద్-2025' ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు మాట్లాడుతూ విద్యారంగం, పరిశ్రమ మధ్య అంతరాన్ని తగ్గించడం, ప్రభుత్వం, ఆర్థిక సంస్థలు, వ్యవస్థాపకుల మధ్య చురుకైన భాగస్వామ్యాలను పెంపొందించడం తప్పనిసరని ఆయన పేర్కొన్నారు. మేధో సంపత్తి, ఆవిష్కరణల్లో భారతదేశాన్ని అగ్రగామిగా నిలబెట్టడానికి పరిశోధనా పెట్టుబడులను గణనీయంగా పెంచాలని సూచించారు. ప్రఖ్యాత సెలబ్రిటీ యాంకర్, జర్నలిస్టు, కవయిత్రి, చలనచిత్ర విమర్శకురాలు అతికా ఫరూఖీ మాట్లాడుతూ సినిమా సమాజంపై చూపే ప్రభావాన్ని, అది అందించే శక్తివంతమైన సందేశాలను వివిధ చిత్రాలను ఉదహరిస్తూ చెప్పారు. సినిమా టికెట్ కొనడం అంటే దానికి అనుకూలంగా ఓటు వేయడం లాంటిదన్నారు. న్యూస్ మొబైల్ వ్యవస్థాపకుడు, ఎడిటర్-ఇన్-చీఫ్, ప్రఖ్యాత పరిశోధనాత్మక జర్నలిస్టు, గ్లోబల్ ఫ్యాక్ట్ చెకర్ సౌరబ్ శుక్లా, ప్రముఖ ఆర్థికవేత్త, భారత 13వ ఆర్థిక కమిషన్ పూర్వ సలహాదారు డాక్టర్ రతిన్‌రాయ్, ది లెర్నింగ్ కర్వ్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణాధికారి సుబ్బు పరమేశ్వరన్ తదితరులు ప్రసంగించారు.

మల్లన్న ఆలయంలో డిష్యుం..డిష్యుం!

వెనకదారి దర్శన విషయంలో సిబ్బంది కొట్లాట

చేర్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న ఆలయంలో కొనసాగుతున్న వెనకదారి దర్శనాల విషయంలో ఆలయ సిబ్బంది కొట్లాడుకోవడం కలకలం రేపింది. మల్లన్న బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిసినప్పటికీ బుధవారం అనూహ్యంగా భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ క్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నర్సింహులు అందుబాటులో లేకపోవడంతో ప్లంబర్ సార్ల విజయ్‌కుమార్ ఆలయంలో విధులు నిర్వహించసాగాడు. బుధవారం రాత్రి ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆరెళ్ల మహేశ్, ఎక్కలదేవి వినయ్ పలువురు భక్తులను వెంటబెట్టుకుని వెనక దారిగుండా దర్శనానికి తీసుకు రాగా, అర్ధ మండపం నుంచి రావాలని సార్ల విజయ్ అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాలు వాదోపవాదాలు చేసుకుని బాహాబాహీకి దిగారు. ఈ ఘటనలో తన ఎడమ చేతికి గాయమైందని, మహేశ్‌పై చర్యలు తీసుకోవాలని విజయ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు ఆలయంలో సీసీ ఫుటేజీలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు. ఇదిలా ఉండగా... కొన్నాళ్ల క్రితం ఆలయ కార్యాలయ గదిలో ఈవో సమక్షంలోనే ద్వితీయ శ్రేణి అధికారులు గలాటా పడి పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. తాజాగా వెనకదారి దర్శన విషయంలో ఆలయ ఆవరణలో భక్తులు చూస్తుండగానే బాహాబాహీకి ఒడిగట్టడం కలకలం రేపింది. ఆలయ పాలన గాడితప్పుతున్న క్రమంలో పరిస్థితి చేజారిపోకముందే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి ఆలయ ప్రతిష్ఠతో పాటు భక్తుల మనోభావాలు పరిరక్షించాలని కోరుతున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో
అటానమస్ కళాశాలలపై విచారణ జరపాలి

- యూఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి

గజ్వేల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలోని అటానమస్ కళాశాలలపై విచారణ జరపాలని యూఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి డిమాండ్ చేశారు. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్(యూజీసీ) తెలంగాణ వ్యాప్తంగా 105 కళాశాలలకు అటానమస్ ప్రకటించిందని, వీటిపై పునర్విచారణ జరపాలని యూఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో యూజీసీలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. అనేక కళాశాలల్లో కనీస వసతులు కల్పించకుండా అటానమస్ కల్పించడం సిగ్గుచేటన్నారు. అటానమస్ ప్రకటించిన కళాశాలల్లో తనిఖీ చేసిన అధికారులను తక్షణమే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. యూజీసీ అధికారుల ఆస్తులపై సీబీఐ విచారణ జరపాలని లేనిపక్షంలో యూజీసీ ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలోత్ రాజేశ్‌నాయక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి సంద గణేశ్, రాష్ట్ర కమిటీ సభ్యులు పాలకురి హరీశ్ పాల్గొన్నారు.

గజ్వేల్ ఆసుపత్రిని పరిశీలించిన కాయకల్ప బృందం

గజ్వేల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని గురువారం కాయకల్ప బృందం సభ్యులు పరిశీలించారు. హైదరాబాద్‌లోని గోల్కొండ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాయకల్ప బృందం సభ్యులు ఆసుపత్రిని పరీక్షించారు. బృందం సభ్యులకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ పలు వార్డులు, ఆపరేషన్ థియేటర్, స్వచ్ఛత నిర్వహణ, లేబర్ రూమ్, వేస్ట్ మేనేజ్మెంట్‌ను దగ్గరుండి చూపించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు ఆస్పత్రిని క్షుణ్ణంగా పరిశీలించి గ్రేడింగ్ నిర్వహించారు. ఆసుపత్రి నిర్వహణ తీరుపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు. కాయకల్ప బృందం సభ్యులు పద్మావతి, విజేత, ఫాతిమా, మేరీ సుస్మిత, మనోజ్‌లు, అసిస్టెంట్ డాక్టర్ జయశ్రీ, డ్యూటీ డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ ప్రతిమ, శ్రీనివాస్, నర్సింగ్ సూపరింటెండెంట్ సువర్ణ, కాయకల్ప బృందం సభ్యులు తదితరులున్నారు.

'కాంతార్' కనికట్టు

5వ పేజీ తరువాయి

సొమ్ము తమకు తిరిగి వస్తుందనే ధీమాతోనే ఉన్నారు. అయితే ఆ సంస్థ బోర్డు తిప్పేసినట్లు అర్థమవుతోంది.

వాళ్లే సూత్రధారులు!

కౌడిపల్లి కేంద్రంగా వ్యాపారం నిర్వహించే వ్యక్తితోపాటు మరొకరు ఈ దందాలో కీలకంగా ఉన్నట్లు తెలుస్తోంది. వీరితోపాటు గ్రామాలవారీగా కొందరు ఏజెంట్లను నియమించి వారి ద్వారా డబ్బులు వసూలు చేశారు. తాను రూ.20వేలు చెల్లించానని, 10 రోజుల పాటు రూ.700 చొప్పున డబ్బులు వచ్చాయని.. వారం నుంచి రావాట్లేదని బాధితుల్లో ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. అదేవిధంగా భర్త లేని తనకు ప్రతీరోజు రూ.200 చొప్పున డబ్బులు వస్తే ఆసరాగా ఉంటుందని ఓ వితంతువు తన కాలి కడియాలు విక్రయించి రూ.6వేలు కట్టింది. బాధితుల వేళ్లన్నీ ఆ ఇద్దరి వైపే చూపిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో కొత్త సంస్కృతి

కౌడిపల్లి వంటి ఘటనలు గతంలో సిద్దిపేట జిల్లా గజ్వేల్, జగదేవ్‌పూర్, ములుగు, మర్కుక్ మండలాల్లో చోటుచేసుకున్నాయి. పలు మండలాల్లో ఇప్పటికీ మల్టీలెవల్ మార్కెటింగ్ స్కీములు, బిట్‌కాయిన్ దందాలు నడుస్తున్నాయి. సులభంగా డబ్బులు సంపాదించొచ్చని గుడ్డిగా పెట్టుబడులు పెడుతున్నారు. ఆన్‌లైన్ యాప్స్, ఇతర గ్రూపుల్లో పెట్టుబడులు పెట్టి నష్టపోయిన తర్వాత ఆత్మహత్యలు చేసుకున్నవారి సంఖ్య మెతుకుసీమలో క్రమంగా పెరుగుతోంది. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోనూ ఇలాంటి ఈజీమనీ సంస్కృతి విస్తరిస్తున్నది. పోలీసు యంత్రాంగం సోషల్ మీడియా ద్వారా హెచ్చరికలు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో కూడా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఊరు, పేరు లేని బోగస్ సంస్థల ఉచ్చులో పడకుండా ప్రజలు కూడా ఆలోచించాలి.

జోడు లింగాల జాతర

ఏప్రిల్ 2 నుంచి జోగినాథుడి ఉత్సవాలు

గరుడ గంగ స్నానంతో ప్రారంభం


స్వయంభువుగా వెలసిన జోడు లింగాలు


ఆలయం ప్రాంగణం

జోగిపేట, మార్చి27(ఆంధ్రజ్యోతి): జోగినాథ గుట్టగా పిలిచే వైక్రాంతగిరి ప్రాంతంలో వెలసి, భక్తుల కోరికలు నెరవేర్చే భక్తసులభుడు శ్రీజోగినాథస్వామి ఆలయ జాతర ఉత్సవాలు ఏప్రిల్ 2 నుంచి ప్రారంభం కానున్నాయి. జోడు లింగాల రూపంలో స్వయంభువుగా వెలసిన ఈశ్వరునికి ప్రతీ ఏటా చైత్ర శుద్ధ పంచమి నుంచి పది రోజులపాటు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. కొన్నాళ్లు సజావుగా సాగి నిలిచిపోయన ఉత్సవాలను 25 ఏళ్ల క్రితం పునఃప్రారంభించారు. రథోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈసారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఏప్రిల్ 2న గరుడ గంగ స్నానంతో ఉత్సవాలను ప్రారంభించనున్నారు. గుట్ట కింద సుమారు 2 కిలోమీటర్ల దూరంలోని మంజీరా నది నుంచి నీటిని తెచ్చి జోడు లింగాలకు అభిషేకం నిర్వహిస్తారు. దీనినే గరుడగంగా స్నానంగా పిలుస్తారు. ఉత్సవాలు నిర్వహించనున్న వారం రోజుల పాటు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు సభ్యులతో సంకీర్తనలు, హరికథలు, భజనలు, సత్సంగాలు నిర్వహించనున్నారు.

ఉత్సవ కార్యక్రమాలు

ఏప్రిల్ 4న రథ శిఖర స్థాపన
ఏప్రిల్ 7న రాత్రి అంగరంగ వైభవంగా రథోత్సవం
ఏప్రిల్ 8న బండ్ల ఊరేగింపు, పద్మశాలీలు సెల్లా
ఏప్రిల్ 9న భక్తుల అగ్నిగుండ ప్రవేశం
ఏప్రిల్ 10న శివపార్వతుల కల్యాణం
ఏప్రిల్ 11న అర్ధరాత్రి లంకాదహనం
ఏప్రిల్ 12న కుంకుమార్చనలు, రుద్రాభిషేకం

జిల్లాలోనే పెద్ద రథం



ఇక్కడ ఏర్పాటు చేసిన ఇనుప రథం జిల్లాలోనే అతిపెద్దదిగా పేరుగాంచింది. 30 టన్నుల ఇనుముతో 50 అడుగుల ఎత్తుతో 5 అంతస్థులుగా నిర్మించారు. రథం మొదటి అంతస్థులో నంది, రెండో అంతస్థులో గణపతి, మూడో అంతస్థులో దివ్యసుందరీమణులు, నాల్గో అంతస్థులో నాగాలంకార సంయుక్తమైన శివలింగం, ఐదో అంతస్థులో దుర్గామాత విగ్రహాలను పంచలోహాలతో ఏర్పాటు చేశారు.

ఏర్పాట్లలో నిమగ్నం

పట్టణంలోని వ్యాపార, వాణిజ్య, వర్తక ప్రముఖులు, కార్మిక, కర్షక, రాజకీయ నాయకుల సహకారంతో రథోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆర్డీవో పాండు నేతృత్వంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, తహసీల్దారు విష్ణుసాగర్, సీఐ అశోక్ ఆధ్వర్యంలో జాతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యంగా రథం తిరిగే గౌనిచౌరస్తా నుంచి జోగినాథ గుట్ట వరకు రహదారి శుభ్రంతో, గుంతలు పూడ్చడం, ఆమార్గంలో రథోత్సవానికి ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారు. లంకాదహనం జరుగనున్న ఎన్టీఆర్ స్పోర్ట్స్ స్టేడియం ఆవరణలో ఏర్పాట్లు చేస్తున్నారు. జోగినాథ గుట్ట, ఆలయ ప్రాంగణంలో తాగు నీటి వసతి, ఇతర సదుపాయాలను కల్పిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా స్థానిక హనుమాన్ కూడలి నుంచి ఆలయం వరకు విద్యుత్ దీపాలను, పూజా కార్యక్రమాలు వినపడేందుకు మైక్‌సెట్లను అమర్చారు.

కాశీవిశ్వేశ్వరుడి ఉత్సవాలు

పుల్‌కల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్‌లో వెలసిన అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర ఆలయంలో ఉగాది పండుగ నుంచి మూడురోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నారు. 30న బండ్లు, రథోత్సవం, 31న గ్రామ దేవతల బోనాలు, ఏప్రిల్ 1న గోపాల కాల్వలు, పాచి బండ్లు ఊరేగింపు, లంకా దహనం కార్యక్రమాలు జరుగనున్నాయి.

శని అమావాస్యకు పంచగామ
శనీశ్వరాలయం ముస్తాబు

నారాయణఖేడ్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): శనీశ్వర ఆలయాలు దేశంలో తూర్పుగోదావరి జిల్లా మందపల్లి, తమిళనాడు రాష్ట్రంలోని పాండిచ్చేరి, మహారాష్ట్రలోని శనిశింగాపూర్, శనిఘాట్‌లలో మాత్రమే ఉన్నాయి. తెలంగాణలో మాత్రం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం పంచగామలోనే ఉంది. 29న శని అమావాస్యను పురస్కరించుకుని భక్తుల సౌకర్యం కోసం ఆలయ వ్యవస్థాపకులు కాశీనాథ్ బాబా ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. శనీ అమావాస్య చాలా అరుదుగా వస్తుందని, ఈ విధంగా వచ్చిన రోజు శనీశ్వరుడికి పూజలు చేస్తే దోషాల నివారణ జరుగుతుందని నమ్మకమని కాశీనాథ్ బాబా తెలిపారు. ఆలయంలో 29న ఉదయం 6 నుంచి ఆలయంలో తైలాభిషేకాలు, సాయంత్రం 4 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం భోజన వసతి కల్పించినట్లు పేర్కొన్నారు.


పంచగామలోని శనీశ్వరుడు

యథేచ్ఛగా బియ్యం రవాణా

- అడ్డాగా మారిన నారాయణఖేడ్
- అధికారులకు వరంగా అక్రమ రవాణా
- బహిర్గతమైతేనే కేసులు... లేదంటే లోలోనే ముడుపులతో సర్దుబాటు


నిజాంపేట వద్ద రెండు లారీల్లో బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు(ఫైల్)

నారాయణఖేడ్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు సరఫరా చేయాల్సిన పీడీఎస్ బియ్యాన్ని యథేచ్ఛగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. సరిహద్దు ప్రాంతమైన నారాయణఖేడ్ దీనికి అడ్డాగా మారింది. ఖేడ్ ప్రాంతం కర్ణాటక, మహారాష్ట్రల సరిహద్దుల్లో ఉండడంతో హైదరాబాద్, నల్గొండ, రంగారెడ్డి, జిల్లాలకు చెందిన వ్యాపారులే కాకుండా, కర్ణాటక ప్రాంతానికి చెందిన వారు నారాయణఖేడ్ నుంచే బియ్యాన్ని తరలించే మార్గంగా ఎంచుకున్నారు. ఈ బియ్యం అక్రమ రవాణా అధికారులకు వరంగా మారింది. అధికారులు అక్రమ బియ్యంను పట్టుకున్న సమయంలో బహిర్గతమైతేనే కేసులు చేస్తున్నారని, లేదంటే లోలోనే ముడుపులతో సర్దుబాటు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

వారం రోజుల క్రితం అకోలా-హైదరాబాద్ జాతీయ రహదారి 161పై సంగారెడ్డి జిల్లా మాసాన్‌పల్లి సమీపంలో కల్హేర్ పోలీసులు మూడు తారస్ లారీలలో బియ్యం తరలిస్తుండగా తెల్లవారుజామున పట్టుకున్నారు. అనంతరం ఈ వ్యవహారాన్ని గోప్యంగా ఉంచినప్పటికీ కొన్ని గంటల తర్వాత పౌర సరఫాల శాఖ అధికారులకు అప్పగించారు. వాస్తవానికి మూడు లారీలను పట్టుకున్నప్పటికీ, రెండు లారీలు ఏపీ28టీసీ9549, ఏపీ28టీఏ7550 నంబర్లు గల లారీలపై మాత్రమే కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వాస్తవానికి ఒక్కో తారస్ లారీలో 600 గ్సన బ్యాగులు, 30 టన్నుల బియ్యం ఉన్నప్పటికీ, అధికారులు మాత్రం 45 టన్నులు ఉన్నట్లే కేసు నమోదు చేశారు. కేసు కాగానే తూకం చేసి పౌర సరఫరాల అధికారులకు స్వాధీనం చేయాల్సి ఉంది. కానీ, తూకం వేయకుండానే తక్కువ బియ్యం ఉన్నట్లు కేసు నమోదు చేయడం పట్ల పలువురు విమర్శిస్తున్నారు. అదేరోజున పట్టుకున్న టీజే36టీ9255 నంబరు గల మరో లారీపై అదే రోజు కేసు నమోదు చేయకుండా నాన్చుడు దోరణితో వ్యవహరించారు. ఉన్నతాధికారులకు సమాచారం తెలియడంతో మరుసటి రోజు కేసు నమోదు చేశారని తెలిసింది. లారీలను పట్టుకున్న సమయంలో అసలు స్మగ్లర్లపై కేసులు నమోదు చేయకుండా, వారి గుమాస్తాలు, డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తున్నారని కూడా ఆరోపణలు ఉన్నాయి.

ఆరు నెలల క్రితం నిజాంపేట ఫ్లైఓవర్ వద్ద రెండు లారీల బియ్యంను పట్టుకున్నప్పటికీ, ఒక రోజు తర్వాత కేసు నమోదు చేశారని, కొన్నిసార్లు అధికారులకు, అక్రమార్కులకు మధ్య సయోధ్య కుదిరితే పీడీఎస్ బియ్యంను మార్చి సన్నబియ్యం ఉన్నట్లుగా కూడా చూపుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కర్ణాటకకు చెందిన ఒక బడా వ్యాపారి అడ్డు అదుపు లేకుండా ఖేడ్ మీదుగా తన లారీలకు ముందు ప్రత్యేక వాహనాలతో చేజింగ్ చేస్తూ సరిహద్దులను యథేచ్ఛగా దాటిస్తుంటారని సమాచారం. ఆ వ్యాపారిపై జిల్లాలో అనేక కేసులు ఉన్నాయని, అయినప్పటికీ రవాణా కొనసాగుతుందని తెలిసింది. జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపించి ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఈ విషయమై నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డిని ఆంధ్రజ్యోతి పలుకరించగా మాసాన్‌పల్లి సమీపంలో నమ్మదగిన సమాచారం మేరకు మూడు లారీల్లో బియ్యంను పట్టుకున్నప్పటికీ, రెండు లారీల్లో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు బహిర్గతం కావడంతో కేసులు నమోదు చేసి సివిల్ సప్లై అధికారులకు సమాచారం ఇచ్చామని చెప్పారు. మరో లారీకి సంబంధించి టెక్నికల్ సమస్య ఉండడంతో ఆంధ్రప్రదేశ్ నుంచి గుజరాత్‌కు వెళ్తుండడంతో, అందులో కూడా పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించి కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

'జర్నలిస్టుపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

జోగిపేట, మార్చి27(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో భాగంగా, వీడియో తీస్తున్న జర్నలిస్టుపై దాడిచేసి హత్య చేయడానికి ప్రయత్నించిన పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాదారులపై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు సంఘాల నాయకులు డీఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. బుధవారం సాయంత్రం మండలంలోని సంగుపేట శివారులో పీడీఎస్ బియ్యంను అక్రమ రవాణా చేస్తుండగా జోగిపేట కేంద్రంగా పనిచేస్తున్న ఓ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు వాహనాలతో సహా వీడియో తీస్తుండగా, అదే వాహనంలో ఉన్న దానిష్ పటేల్, ఎండీ షకీల్ తదితరులు కలిసి జర్నలిస్టుపై కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో సదరు జర్నలిస్టు ఎడమ చేయి విరిగింది. ఈ ఘటనకు సంబంధించి గురువారం బాధిత జర్నలిస్టు, అందోలు ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా జర్నలిస్టులు సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్‌కు ఫిర్యాదు చేశారు.

విద్యతోనే
అణగారిన వర్గాల అభ్యున్నతి

- ప్రొఫెసర్ బి.శివారెడ్డి
- ముగిసిన జాతీయ సదస్సు
- హాజరైన పలు రాష్ట్రాల పరిశోధక విద్యార్థులు
- 37 పరిశోధన పత్రాల సమర్పణ



మాట్లాడుతున్న ప్రొఫెసర్ బి.శివారెడ్డి

సిద్దిపేట కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : విద్య ద్వారానే అసమానతలు తొలగుతాయని, అణగారిన వర్గాల అభ్యున్నతి సాధ్యమవుతుందని ప్రొఫెసర్ బి.శివారెడ్డి తెలిపారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల అర్థశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ముగిసింది. అట్టడుగు వర్గాల సమానత్వం, సమ్మిళిత సమాజం అనే అంశంపై నిర్వహించిన జాతీయ సెమినార్‌కు మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, కేరళ రాష్ట్రాల యూనివర్సిటీల నుంచి పరిశోధక విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 37 పరిశోధక పత్రాలను విద్యార్థులు సమర్పించారు. గురువారం నిర్వహించిన ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ బి.శివారెడ్డిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్య కోసం సరిపడా బడ్జెట్ కేటాయింపులు చేయాలన్నారు. సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన బీసీ కమిషన్ మెంబర్ ఆర్.బాలలక్ష్మి మాట్లాడుతూ నాణ్యమైన ఆరోగ్యం నాణ్యమైన విద్య ద్వారానే అందుతుందన్నారు. అట్టడుగు వర్గాలు విద్యావంతులుగా తయారవ్వడంతో పాటుగా ఉన్నతమైన లక్ష్యంతో జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు సూచించారు. సెమినార్‌కు కన్వీనర్‌గా డా.శ్రద్ధానందం వ్యవహరించగా, ప్రిన్సిపాల్ సునీత అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.అయోధ్యరెడ్డి, కళాశాల పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ గోపాల సుదర్శనం, టీఎస్‌కేసీ కో ఆర్డినేటర్ ఉమామహేశ్వరి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ రవినాథ్, మెదక్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్, ట్రాన్స్‌జెండర్ యాక్టివిస్ట్ రచన, అధ్యాపకులు కొమ్మిడి రాణి, పున్నెమ్మ పాల్గొన్నారు. జాతీయ స్థాయి సెమినార్ సిద్దిపేటలో జరగటం, అందులోనూ తమ కళాశాలలో నిర్వహించుకోవటం గర్వంగా ఉందని డిగ్రీ కళాశాల విద్యార్థులు ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థుల పరిశోధనలు, వక్తల సెమినార్‌లు తమకు చాలా ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

- ఎల్లాయిపల్లిలో కాలువలో వాటర్ ట్యాంకర్ బోల్తాపడి డ్రైవర్ దుర్మరణం
- ట్రాక్టర్ ట్రాలీ చక్రాలు పైనుంచి వెళ్లడంతో మాధారంలో బాలుడు
- రిమ్మనగూడలో గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ
- రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై చికిత్సపొందుతూ యువకుడు

చిన్నకోడూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు వాటర్ ట్యాంకర్ కాలువలో బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం ఎల్లాయిపల్లి గ్రామ శివారులో గురువారం జరిగింది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. బీహర్ రాష్ట్రానికి చెందిన తుఫాన్ కుమార్(23) ఎల్లాయిపల్లి గ్రామ శివారులో జరుగుతున్న అదనపు టీఎంసీ పంపుహౌస్ నిర్మాణ పనుల్లో కొద్ది రోజులుగా వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కమ్మర్లపల్లి గ్రామ శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ఎల్లాయిపల్లి మీదుగా కొత్తపల్లి గ్రామం వరకు రోడ్డుపై దుమ్ము లేవకుండా వాటర్ ట్యాంకర్‌తో ప్రతీరోజు నీళ్లు పడుతుంటాడు. గురువారం సాయంత్రం ఎల్లాయిపల్లి శివారులోని గేట్ల వద్ద ఉన్న కాలువ నుంచి ట్యాంకర్‌లోకి నీటిని నింపేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు వాటర్ ట్యాంకర్ రివర్స్‌లో అదుపు తప్పి కాలువలో పడింది. గమనించిన కూలీలు, తోటి డ్రైవర్లు క్రేన్ సాయంతో కాలువలో నుంచి ట్యాంకర్‌ను బయటకు తీశారు. తుఫాన్ కుమార్‌కు గాయాలై అపస్మారక స్థితిలోకి చేరుకోవడంతో ఓ వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.


కాలువలో బోల్తాపడిన వాటర్ ట్యాంకర్‌ను బయటకు తీస్తున్న దృశ్యం

నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడపడంతో బాలుడి మృతి


సందీప్ మృతదేహం

జిన్నారం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అజాగ్రతగా ట్రాక్టర్‌ను నడిపిన ఘటనలో బాలుడు మృతిచెందిన ఘటన గురువారం సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల పరిధిలోని మాధారంలో చోటచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. డ్రైవర్ గంగారం, సందీప్(12)ను ట్రాక్టర్ ఇంజన్, ట్రాలీకి మధ్యన ఎక్కించుకుని అతివేగంతో ట్రాక్టర్‌ను నడపగా.. బాలుడు కిందపడ్డాడు. అతడిపై నుంచి ట్రాలీ చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మరణించాడు. ట్రాక్టర్ డ్రైవర్ గంగారం మృతుడు సందీప్‌ను ట్రాక్టర్ ఇంజన్, ట్యాంకర్‌కు మధ్య గల ప్రాంతంపై ఎక్కించుకొని అతివేగంతో ట్రాక్టర్ నడుపగా.. బాలుడు కింద పడ్డాడు. అతడిపై నుంచి ట్రాలీ చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మరణించాడు. బాలుడి మృతికి కారణమైన డ్రైవర్ గంగారంపై కేసు నమోదు చేసినట్లు సీఐ రవీందర్‌రెడ్డి తెలిపారు.

రిమ్మనగూడలో మహిళ


బొప్ప రాజవ్వ(ఫైల్)

గజ్వేల్ రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రిమ్మనగూడ వద్ద గురువారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దౌల్తాబాద్ మండలం తిరుమలాపూర్ గ్రామానికి చెందిన బొప్ప బాల్‌నర్సయ్య, రాజవ్వ దంపతులిద్దరు టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై తిరుమలాపూర్ గ్రామం నుంచి గజ్వేల్ మండలం దాతర్‌పల్లి గ్రామానికి వస్తున్నారు. రిమ్మనగూడ వద్ద దాటే క్రమంలో ఎక్స్‌ఎల్‌ను ప్రజ్ఞాపూర్ నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనగా బొప్ప రాజవ్వ(58) కిందపడి అక్కడికక్కడే మృతిచెందింది. భర్త బాల్‌నర్సయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. రాజవ్వ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

ఆటో అదుపు తప్పి..

ములుగు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా ములుగు మండలం కొక్కొండ గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అనిల్‌గౌడ్(30) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బుధవారం బస్వాపూర్ నుంచి కొత్తూరుకు వెళ్తుండగా ఆటో అదుపుతప్పి చెట్టుకు ఢీకొని గుంతలో పడింది. గాయాలపాలైన అనిల్‌గౌడ్‌ను చికిత్స నిమిత్తం లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

రైతులు లాభసాటి వ్యవసాయం చేయాలి

జహీరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మార్కెటింగ్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులు లాభసాటి వ్యవసాయం చేస్తేనే ఆర్థికంగా నిలదొక్కుకుంటారని సంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మండంలోని దిడిగి శివారులో గల డీడీఎస్-కేవీకేలో నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డీడీఎస్-కేవీకే ఈప్రాంత రైతులకు వెన్నుదన్నుగ నిలుస్తున్నాయన్నారు. సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేయాలన్నారు.

పేదలకు న్యాయం చేయమంటే అరెస్టులా..?

సంగారెడ్డి రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పేదలకు న్యాయం చేయమన్నందుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఇతర నాయకులను అరెస్టు చేస్తారా అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జయరాజ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీపీఎం నాయకుల అరెస్టును ఖండిస్తూ గురువారం సంగారెడ్డిలో ప్లకార్డులతో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ పేదల భూములు ఆక్రమించిన రామోజీ ఫిల్మ్‌సిటీ యాజమాన్యంపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీజ్ చేసిన ఇసుక వేలం

వెల్దుర్తి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : హల్దీవాగు నుంచి అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన ఇసుకను ఏప్రిల్ 3న వేలం వేయనున్నట్లు గురువారం తహసీల్దార్ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హల్దీవాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న 17 ట్రాక్టర్ల ఇసుకను సీజ్‌చేశామన్నారు. ఆసక్తి ఉన్నవారు ముందుగా రూ.2 వేలు డిపాజిట్ చేసుకొని వేలంలో పాల్గొని ఇసుకను దక్కించుకోవాలని సూచించారు.

'ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి'

రామచంద్రాపురం టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్ ప్రవీణ్‌పగడాల మృతిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని పాస్టర్ల సంఘం ప్రతినిధులు కోరారు. గురువారం రామచంద్రాపురం కూడలిలో నిరసన తెలిపి మాట్లాడారు. రాజమండ్రిలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై విచారణ జరిపి క్రైస్తవులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

అంబేడ్కర్ జయంతిని అధికారికంగా నిర్వహించండి

సంగారెడ్డి రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఏప్రిల్ 14న జరిగే డా.బీఆర్ అంబేడ్కర్ జయంతిని అన్ని గ్రామాల్లో అధికారికంగా నిర్వహించాలని కులవివక్ష పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో గురువారం అదనపు కలెక్టర్ మాధురికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు.

ఖేడ్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బోజిరెడ్డి

నారాయణఖేడ్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ జూనియర్ సివిల్ జడ్జి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి మారుతిరెడ్డి ప్రకటించారు. అధ్యక్షుడిగా కె.బోజిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా నర్సింహారావు, సహాయ కార్యదర్శిగా సంగమేశ్వర్ రెడ్డి, కోశాధికారిగా సాయిలు, మహిళా ప్రతినిధిగా ప్రమీలపాటిల్, సలహాదారులుగా ఆనంద్ స్వరూప్‌షెట్కార్, లక్ష్మణ్ రావు, నర్సారెడ్డి ఎన్నికయ్యారని తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానవ జన్మకు మోక్షం

నాగల్‌గిద్ద, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతోనే మానవ జన్మకు మోక్షం లభిస్తుందని కర్ణాటకలోని బాల్కికి చెందిన మహారాజ్ నిరంజన్‌స్వామి అన్నారు. గురువారం మండల పరిధిలోని మావినెల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన భక్తులనుద్దేశించి మాట్లాడారు. మహాత్మ బసవేశ్వరుడు చూపిన బాటల్లో నడుచుకోవడంతో పాటు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని భక్తులకు సూచించారు.

ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టాలి

నిజాంపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి లబ్ధిదారుడు ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టి సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ పీడీ మాణిక్యం పేర్కొన్నారు. మండల పరిధిలోని నందగోకూల్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి మాట్లాడారు. గ్రామానికి 59 ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకాగా.. అందులో 18 ఇళ్ల నిర్మాణాలను చేపట్టారన్నారు.

రిజర్వేషన్లు కల్పించాలి

మెదక్ కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మెదక్ మున్సిపల్ ఎన్నికల్లో ఎస్సీలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలంటూ కలెక్టర్‌కు దళిత సంఘాల నాయకుల గురువారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. 1952 నుంచి ప్రత్యేకంగా ఎస్సీలకు రిజర్వేషన్లు కేటాయించలేదని అన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవనం తక్షణమే నిర్మించాలని అన్నారు.

ఆరుబయటే విద్యాబోధన



నాగల్‌గిద్ద మండలం లాస్కరీతండాలో మరమ్మతుకు నోచుకోని పాఠశాల భవనం



ఆరు బయటే పాఠాలు బోధిస్తున్న టీచర్ అరుణ

నాగల్‌గిద్ద, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నాగల్‌గిద్ద మండల పరిధిలోని లాస్కరితండా ప్రాథమిక పాఠశాల భవనం మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఉపాధ్యాయులు ఆరుబయటనే విద్యాబోధన చేస్తున్నారు. ఈ పాఠశాల భవనం అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఈ విద్యాసంవత్సరంలో ఎంపికైంది. పాఠశాల మరమ్మతులకు రూ.4 లక్షల నిధులు మంజూరయ్యాయి. సదరు కాంట్రాక్టర్ నెలక్రితం పనులు ప్రారంభించి, లేబర్ సమస్య ఉందంటూ అర్థాంతరంగా నిలిపేశాడు. దీంతో 15 మంది విద్యార్థులతో ఉపాధ్యాయురాలు అరుణ ఆరుబయటనే విద్యాబోధన కొనసాగిస్తోంది. అధికారులు స్పందించి మరమ్మతులు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తెలంగాణలో భవిష్యత్ బీజేపీదే: ఎమ్మెల్సీ అంజిరెడ్డి



ఎమ్మెల్సీ అంజిరెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

పుల్‌కల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీదే భవిష్యత్ అని పట్టభద్రుల ఎమ్మెల్సీ సీ.అంజిరెడ్డి అన్నారు. ఈ నెల 30 నుంచి మండల కేంద్రం చౌటకూర్‌లో ప్రారంభంకానున్న అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వరస్వామి రథోత్సవాల ఆహ్వాన పత్రికను బీజేపీ నాయకులు అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు సీ.గోదావరిని కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రాజకీయ ముఖచిత్రం మారనున్నదన్నారు. రోజురోజుకు బీజేపీ బలపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు నీరుడి ప్రవీణ్‌కుమార్‌ముదిరాజ్, ప్రవీణ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గొంగ్లూరు జనార్ధన్, ముకుందంముదిరాజ్, సార రాజ్‌కుమార్, సుధాకర్‌గౌడ్, పుట్టి మోహన్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లతో ఆర్థికంగా ఎదగాలి: ఎమ్మెల్యే వివేక్



కమలాపూర్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వివేక్ వెంకటస్వామి

మనూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకొని ఉద్యోగ, ఆర్థిక, రాజకీయంగా ఎదిగి తమ వర్గాల అభ్యున్నతికి పాటు పడాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. మనూరు మండల పరిధిలోని కమలాపూర్ గ్రామంలో దళిత రాష్ట్ర నేత నల్లా సూర్యప్రకాష్ సహకారంతో ఏర్పాటు చేసచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ రెడ్డి, దాత సూర్యప్రకాష్‌తో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. నిమ్నవర్గాలు ఐక్యంగా ఉంటూ అభివృద్ధి సాధించాలన్నారు. ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పాటు పడిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రాకేష్‌షెట్కార్, జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మశ్చేందర్, ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ మారుతి, నాయకులు పాల్గొన్నారు. విగ్రహావిష్కరణ సందర్భంగా ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట నుంచి కమలాపూర్ వరకు మూడు కిలో మీటర్ల భారీ ర్యాలీ నిర్వహించారు.

రక్తదానం ఎందరికో ప్రాణదానం

● కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి



రక్తదాన శిబిరంలో రాజిరెడ్డి, సుహాసినిరెడ్డి

నర్సాపూర్/వెల్దుర్తి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం ఎందరికో ప్రాణదానమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి పేర్కొన్నారు. రాజిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సాయికృష్ణ గార్డెన్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా రక్తదానం చేయడం అభినందనీయమని. వారికి ఎప్పుడు రుణపడి ఉంటానన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు రాజుయాదవ్, వెంకట్రామ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు శ్రీనివాస్‌గుప్తా, కమలపూల్‌సింగ్, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు మల్లేశం, అంజిగౌడ్, సుదర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రమైన వెల్దుర్తిలోని బస్టాండ్ చౌరస్తా వద్ద గురువారం పట్టణ అధ్యక్షుడు మల్లేశం ఆధ్వర్యంలో నాయకులు ఆవుల రాజిరెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు.

శ్రీవైకుంఠపురంలో ఎస్పీ పూజలు

సంగారెడ్డి అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి శివారులోని శ్రీవైకుంఠపురం ఆలయంలో ఎస్పీ పరితోష్ పంకజ్ దంపతులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోషాలను సందర్శించారు. ఆలయ ప్రధాన అర్చకులు కందాడై వరదాచార్యులు వారికి ప్రత్యేక పూజలు జరిపించి వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని ఎస్పీకి జ్ఞాపికగా అందజేసి, ఆలయ విశిష్టతను వివరించారు.

ఇఫ్తార్ విందుతో సోదరభావం పెంపు



నారాయణఖేడ్: ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు



సంగారెడ్డిలో ఇఫ్తార్ విందులో భాగంగా ఎస్పీ పరితోష్ పంకజ్‌కు పండ్లు తినిపిస్తున్న పోలీసులు

నారాయణఖేడ్/సంగారెడ్డి క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఇఫ్తార్ విందుతో సోదరభావం పెంపొందుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. గురువారం నారాయణఖేడ్‌లోని సాయిబాబా ఫంక్షన్‌హాల్‌లో ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అలాగే విందులో జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి, పీసీసీ సభ్యులు శ్రీనివాస్, శంకరయ్యస్వామి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ ముస్లింలకు రంజాన్ పవిత్ర మాసమని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏ.సంజీవరావు, నయీమొద్దీన్, విజయకృష్ణ, రామారావు, ముస్లిం సిబ్బంది పాల్గొన్నారు.

తైబజార్ ద్వారా రూ.56,28,000 ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి

అమీన్‌పూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 15 మార్కెట్ల తైబజార్ వసూళ్లకు గురువారం నిర్వహించిన వేలం పాట ద్వారా రూ.56,28,000 లక్షల ఆదాయం సమకూరింది. అమీన్‌పూర్ పరిధిలోని 9 మార్కెట్లకు మహేష్ అనే కాంట్రాక్టర్ రూ.18,27,000లకు దక్కించుకోగా, బీరంగూడ పరిధిలోని 6 మార్కెట్లకు చంద్రమోహన్‌రెడ్డి అనే కాట్రాక్టర్ రూ.38,0,1000 బహిరంగ వేలం పాటలో దక్కించుకున్నారు. వేలంలో మొత్తం 8 మంది కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని వారాంతపు సంతలు, మార్కెట్ల తైబజార్ వేలం ద్వారా గతేడాది కంటే రూ.8,10,000 ఆదాయం సమకూరింది. తైబజార్ కాంట్రాక్టర్లు అధిక ధరలు వసూళ్లు చేసినా, చిరువ్యాపారులతో దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజా ప్రభుత్వమంటూనే ప్రజల గొంతులు నొక్కుతారా.?

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్కరాములు



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వమంటేనే ప్రజల గొంతులు నొక్కుతారా.? అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు ప్రశ్నించారు. గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డును రద్దు చేయచాలని డిమాండ్ చేస్తూ గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సీపీఎం నాయకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలను నిర్బంధాలతో అణచివేయాలని చూస్తే ప్రజలు మరింత తిరగబడతారని హెచ్చరించారు. ప్రజల అభిప్రాయాలకు భిన్నంగా ఏకపక్షంగా డంపింగ్‌యార్డును ఏర్పాటు చేయాలనే నిర్ణయం సరైంది కాదన్నారు. వాస్తవ పరిస్థితులు గమనించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాల్సిన బాధ్యత కలెక్టర్‌పై ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య, సాయిలు, మాణిక్యం, నర్సింలు, కమిటీ సభ్యులు నాగేశ్వర్, ప్రవీణ్‌కుమార్, యాదగిరి, కృష్ణ, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాచన్నస్వామి హుండీ ఆదాయం రూ.3.41 లక్షలు

కోహీర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బడంపేట గ్రామంలో గల రాచన్నస్వామి ఆలయ హుండీని గురువారం లెక్కించారు. జనవరి 3 నుంచి మార్చి 27వ తేదీ వరకు భక్తులు స్వామివారికి సమర్పించుకున్న హుండీ ఆదాయం రూ.3,41,801 లక్షలు వచ్చినట్లు ఈవో శివరుద్రప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ సూపరింటెండెంట్ శివరాజ్, ఆలయ కమిటీ సభ్యులు దయానంద్‌పాటిల్, అశోక్, శ్రీపాల్, గోపాల్, ప్రతాప్, రాజన్న, రాచన్న, సుధాకర్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



చెక్కు అందజేస్తున్న భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధి ద్వారా సంజీవన్‌రావుపేటకు చెందిన కృష్ణవేణికి రూ.60 వేలు, అంబయ్యకు రూ.31 వేలు మంజూరు కాగా.. అందుకు సంబంధించిన చెక్కును బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రేయారెడ్డి, ఖేడ్ తాజామాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, సంజీవన్‌రావుపేట మాజీ ఎంపీటీసీ భూపాల్, విఠల్‌రావు, సాయిరెడ్డి పాల్గొన్నారు. కాగా మాజీ జడ్పీ ప్రణాళిక మండలి సభ్యుడు నగేష్ షెట్కార్ జనాబాయికి రూ.97 వేలు, ప్రభాకర్, రామవ్వకు రూ.60 వేల చొప్పున, అభిషేక్‌రెడ్డికి రూ.59 వేలు, విజయ్‌కుమార్‌కు రూ.33 వేలు, భూలీ స్వామికి రూ.24 వేలు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఝరాసంగం మండలం బోపన్‌పల్లికి చెందిన నర్సప్పకు సీఎం సహాయనిధి ద్వారా రూ.2.5 లక్షల మంజూరుకు సంబంధించిన ఎల్వోసీ ఉత్తర్వును జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, కూతురు శివానీ షెట్కార్‌లు అందించారు.

హామీల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలం: బీజేపీ



దీక్ష ఏర్పాట్లను పరిశీలిస్తున్న మల్లేశంగౌడ్

మెదక్ అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైందని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశంగౌడ్ ఆరోపించారు. రైతు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించే రైతు సత్యాగ్రహ దీక్ష ఏర్పాట్లు ఆయన పరిశీలించి మాట్లాడారు. రూ.2 లక్షల రుణమాఫీని సంపూర్ణంగా అమలు చేయాలన్నారు. రైతు ఆయన వెంట మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్ ఉన్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యమిత్రల సర్వే

సంగారెడ్డి అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రుల్లో గురువారం ఆరోగ్యమిత్రలు సర్వే నిర్వహించారు. రోగి చికిత్స పొందిన తర్వాత సీఎంఆర్ఎఫ్ కింద బిల్లులు పొందిన ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి వివరాలు సేకరించారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో సుమారు 116 ప్రైవేటు ఆస్పత్రుల్లో పడకల సంఖ్య ఎంత, స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్నాయా, మల్టీస్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్నాయా, ఆస్పత్రికి తగ్గట్టు స్పెషాలిటీ డాక్టర్లు ఉన్నారా? అంటూ ఆరాతీశారు. ఆరోగ్యశ్రీ కింద ఎంపానల్డ్ చేసుకునేందుకు ఆసక్తి ఉందా ఇలా వివరాలను ట్రస్టు ఇచ్చిన ప్రొఫార్మాలో పొందుపర్చారు. సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదించినట్టు ఆరోగ్యమిత్రలు వెల్లడించారు.

కాలనీల్లో అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



కాలనీల్లో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్

రామచంద్రాపురం టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి అన్నారు. గురువారం జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డితో కలిసి బోంబేకాలనీలో నిర్మితమవుతున్న రైతుబజార్ పనులు పరిశీలించారు. పార్కింగ్‌కు చుట్టుపక్కల ప్రహరీ పనులు చేపట్టడానికి నిధుల ప్రతిపాదన పంపాలని ఉపకమిషనర్ సురేష్‌ను ఆదేశించారు. చుట్టుపక్కల కాలనీవాసులతో పాటు బస్తీవాసులకు అన్నిరకాల కూరగాయలు లభ్యమయ్యేటట్టు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎల్ఐజీ, అంబేడ్కర్ విగ్రహం చుట్టుపక్కల ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణం చేపట్టడానికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో డీఈ నరేందర్, ఏఈ దివ్య తదితరులు పాల్గొన్నారు.

నెరవేరిన 16 ఏళ్ల కల



స్థలం పత్రాలు అందజేస్తున్న కార్పొరేటర్ పుష్పానగేష్

రామచంద్రాపురం టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విద్యుత్ అవసరాలు తీర్చేందుకు అదనంగా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసేందుకు స్థలం దొరక్క మంజూరైన నిధులు వెనక్కి వెళ్లాయి. రామచంద్రాపురం పట్టణంలో ప్రభుత్వ స్థలం కేటాయింపు జరపడానికి 2009 నుంచి చేసిన అన్వేషణ ఫలించింది. ఎట్టకేలకు కేటాయింపు పత్రాలు కార్పొరేటర్ పుష్పానగేష్ విద్యుత్‌శాఖ అధికారులు అందజేశారు. అనుగుణంగా సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 16 ఏళ్లుగా ప్రభుత్వ స్థలం లభ్యం కాకపోవడంతో విద్యుత్ కష్టాలు ఎదుర్కోవాల్సి వచ్చిందని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయానికి ఆనుకుని ఉన్న స్థలాన్ని మంజూరు చేయాల్సి వచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకాంత్‌నాయక్, విద్యుత్‌శాఖ ఏడీ నాగరాజు, నేత ఆదర్శరెడ్డి, సర్వేయర్ రామభద్రం, ఏఈ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'సర్వే చేయించి మొండిచేయి చూపారు'

సంగారెడ్డి రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులు, ఇతర శాఖల ఉద్యోగలతో సమగ్ర కుటుంబ సర్వేచేయించి రెమ్యునరేషన్ ఇవ్వకుండా మొండి చేయి చూపించిందని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్, రాంచందర్ విమర్శించారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట గురువారం టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించి మాట్లాడారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులను ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లుగా నియమించి రూ.10 వేల రెమ్యునరేషన్ ఇస్తామని 15 రోజుల్లో సర్వే పూర్తి చేయించిందన్నారు. కానీ నాలుగు నెలలు గడుస్తున్నా రెమ్యునరేషన్ చెల్లించకుండా నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. అనంతరం టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మయ్యయాదవ్ మాట్లాడారు. అనంతరం కలెక్టరేట్ ఏవో పరమేశంకు వినతిపత్రం అందజేశారు.

సెయింట్ ఆంథోనీస్‌లో స్కిల్ దర్బార్

సంగారెడ్డి అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో యూలిప్స్ స్కిల్ దర్బార్‌ను గురువారం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ ఈ.విజయ్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల స్కిల్ దర్బార్ కార్యక్రమాన్ని తిలకించి తెలియని విషయాలు వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యాజమాన్యం అఖిల్, మధులత, అరుణారెడ్డి, ప్రదీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన అఖండ సప్తాహ

నారాయణఖేడ్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చాప్టా.కెలో వారంరోజుల పాటు నిర్వహించిన అఖండ హరినామ సప్తాహ గురువారంతో ముగిసింది. చివరిరోజు కేదార్‌నాథ్ ఆలయ ప్రధాన పూజారి శివలింగ్‌స్వామి, మహారాష్ట్రలోని పండరీపూర్ రుక్మిణీపాండురంగ ఆలయానికి సంబంధించి అంబాదాస్‌మహరాజ్ ఆధ్యాత్మిక ప్రవచనాలిచ్చారు. ఉమ్మడి మెదక్ జిల్లా జడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్‌షెట్కార్, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ అభిషేకం, పూజలు నిర్వహించారు. కాగా సదాశివపేట మండలం తంగెడుపల్లిలోని బిల్వ లింగేశ్వర మఠం పీఠాధిపతి గరుగంగాధర్ మహాస్వామి గురువారం ఖేడ్‌లోని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ స్వగృహానికి వచ్చారు. అక్కడ ఆలయ ముఖద్వారం, గోశాల ప్రారంభోత్సవాలకు సంబంధించిన ఆహ్వానపత్రికలను షెట్కార్ సోదరుడు నగేష్‌షెట్కార్, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్‌షెట్కార్‌కు అందజేశారు.

నూతన ఒరవడితో అధిక లాభాలు

● సామాజిక విజ్ఞాన కళాశాల అసోసియేట్ డీన్ విజయలక్ష్మి

జోగిపేట రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నూతన ఒరవడిని అందిపుచ్చుకుని రైతులు అధిక లాభాలు పొందాలని సామాజిక విజ్ఞాన కళాశాల (కమ్యూనిటీ (హోం)సైన్స్ కాలేజీ-హైదరాబాద్) అసోసియేట్ డీన్ విజయలక్ష్మి సూచించారు. గురువారం మండలంలోని కన్‌సాన్‌పల్లిలో ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కృషి అనుభవ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. శాస్త్రవేత్తలు రూపొందిస్తున్న వ్యవసాయ పరికరాలు, పనిముట్లను వాడుకుంటూ, నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని సేద్యం చేయాలని తద్వారా అధిక దిగుబడులు, ఆదాయాలు పొందవచ్చన్నారు. అనంతరం ఏరువాక కేంద్ర సమన్వయకర్త రాహుల్ విశ్వకర్మ మాట్లాడారు.

'ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి'

సంగారెడ్డి రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మాణిపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో గురువారం తెలంగాణ టీచర్స్ యూనియన్(టీటీయూ) జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. అనంతరం టీటీయులో చేరిన వందమందిలో రవికుమార్‌కు సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా, నరసింహారాజుకు జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా, మోహన్‌ను రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నియమించి నియామకపత్రాలు అందజేశారు.

ఖజానాకు రూ.13.24 కోట్లు ఆదాయం

ఐడీఏబొల్లారం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఐడీఏబొల్లారం పురపాలక పట్టణంలో ఆస్తిపన్ను వసూలుకు ప్రత్యేక బృందాలు నియమించామని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 90 శాతం వడ్డీ రాయితీ పథకం పరిశ్రమల యజమానులకు ప్రయోజనకరంగా మారి చెల్లింపులు జరుపుతున్నారని వివరించారు. రాసన్ ఎక్స్‌పోర్ట్స్ అనే పరిశ్రమ యజమాని రవీందర్‌రెడ్డికి రూ.15.58 లక్షలు వడ్డీ రాయితీ వచ్చిందన్నారు. మిగిలిన రూ.30.77 లక్షలు చెల్లించారని తెలిపారు. రాయితీ పథకం వల్ల ఒక్కరోజులో రూ.46 లక్షలు వసూలు చేయగలిగామని తెలిపారు. పట్టణంలో రూ.16.30 కోట్లు పన్నుల రూపంలో వసూలు కావాల్సి ఉండగా ఇప్పటికే రూ.13.24 కోట్లు వసూలు చేసి 80 శాతం పూర్తిచేశామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన 90 శాతం రాయితీ పథకాన్ని ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌వో నర్సింహులు, మేనేజర్ మల్లికార్జున్‌స్వామి, ఏఈ కిష్టయ్య, శ్రీకాంత్, వినోద్ తదతరులు ఉన్నారు.